క్లుప్తంగా

దాడి కేసు నమోదు

బనగానపల్లె రూరల్: నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామంలో మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. గ్రామానికి చెందిన నాగవిజయుడు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన సుబ్బలక్ష్మమ్మ అనే మహిళను జుట్టు పట్టుకొని దుర్భాషలాడి, దాడి చేయడంతో గాయాలైనట్లు చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నాగ విజయుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

గడ్డివామి దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న గ్రామస్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్.బుక్కాపురం గ్రామంలో మోకాసి వెంకట్రాముడుకు చెందిన గడ్డివామికి ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. గమనించిన గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. కాలిపోవడంతో సుమారు లక్ష మేర నష్టం వాటిళ్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ


రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్: పట్టణంలోని వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులు, బాలింతలు, రోగులకు ప్రార్థన సమయం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ దాతల సహకారంతో ఆదివారం రొట్టె, పప్పు, గుడ్డు, అరటిపండ్లు పంపిణీ చేశారు. ఢిల్లీకి చెందిన అబేద్ నగో, గ్రేస్ మనోహరమ్మ కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో వీటిని అందజేసినట్లు తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


పుస్తకాలను పంపిణీ చేస్తున్న బ్రహ్మానంద ఆచారి

బనగానపల్లె రూరల్: పుస్తక పఠనంతో జ్ఞానం పెంచుకోవచ్చని జీకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానంద ఆచారి అన్నారు. ఆదివారం మండలంలోని పలుకూరు గ్రామంలో పుస్తక పఠం విశిష్టతను తెలియజేసి పలు రకాల పుస్తకాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. మంచి పుస్తకం స్నేహితుడితో సమానమన్నారు.

వసతి గృహం విద్యార్థినులకు శాలువాలు


శాలువాలు పంపిణీ చేసిన సభ్యులు

డోన్ టౌన్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల వసతి గృహంలోని 60 మంది విద్యార్థినులకు వివేకానంద సేవా సమితి సభ్యులు దాతల నుంచి సేకరించిన శాలువాలను అందజేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి వ్యవస్థాపకుడు జగన్‌మోహన్, అధ్యక్ష కార్యదర్శులు నాగభూషణంరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, ఇన్నర్‌వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు శారద, వాసవీ మహిళా మండలి ఉపాధ్యక్షురాలు జొన్నలగడ్డ మాధవి, సత్యసేనా రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్ లక్ష్మీబాయి పాల్గొన్నారు.

జీవిత బీమా సొమ్మును చెల్లించాలి

కోవెలకుంట్ల: ఉపాధ్యాయుల ఏపీజీఎల్ఐ(ఆంధ్రప్రదేశ్ జీవిత బీమా) సొమ్మును చెల్లించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ప్రతి నెలా తమ జీతం నుంచి భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడుతుందని ఏపీజీఎల్ఐ పథకానికి పొదుపు చేశారన్నారు. పాలసీ గడువు ముగిసి సీఎఫ్ఎంఎస్‌కి బిల్లులు పంపి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు బీమా సొమ్ము చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది నెలల నుంచి ఉపాధ్యాయులు పథకానికి కోట్లాది రూపాయాలు పొదుపు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని ఏపీజీఎల్ఐ సొమ్ము చెల్లించి ఆదుకోవాలని కోరారు.

27న బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: ఉప్పలపాడు గ్రామంలో ఈ నెల 27న అంతర్రాష్ట్ర న్యూ కేటగిరీ (ఏడు పళ్ల) విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే పోటీలలో గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.8 వేల చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్లు వెల్లడించారు.


● రోడ్ల పక్కనే చెత్తకుప్పలు


కల్వటాలలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న చెత్త

కొలిమిగుండ్ల: పల్లెల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. ప్రధాన రహదారుల వెంట చెత్తకుప్పలు, పేడ దిబ్బలు దర్శనమిస్తున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. గ్రామాల్లో ఫాగింగ్ కూడా చేయడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామ సచివాలయానికి ఒకటి చొప్పున ఫాగింగ్ మిషన్‌లు అందజేశారు. ప్రస్తుతం ఇవి చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. కొలిమిగుండ్ల, కల్వటాల, నందిపాడు, అంకిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో రోడ్ల వెంట చెత్త చెదారం కనిపిస్తున్నాయి. పేడ దిబ్బలు, చెత్త కుప్పలు పేరుకుపోవడంతో రాకపోకలు సాగించే వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. రోడ్లతో పాటు చాలాచోట్ల వీధుల్లో సైతం చెత్తకుప్పలు కనిపిస్తున్నాయి. కొలిమిగుండ్లలో డంపింగ్ యార్డు ఉన్నా నిరుపయోగంగా మారింది. రూ.7లక్షలు వ్యయం చేసి ట్రాక్టర్ ఇంజిన్ కొనుగోలు చేసి రెండు నెలలు దాటినా చెత్త సేకరణకు ట్రాక్టర్‌ను వాడుకలోకి తీసుకురావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన రహదారితో పాటు ఇతర కాలనీ వాసులు చెత్తను ఎక్కడ వేయాలో తెలియక రోడ్ల మీద, బ్రిడ్జిలో పడేస్తున్నారు.

● చిట్టడవిని తలపిస్తున్న చెరువుకట్ట

కొలిమిగుండ్ల: తిమ్మనాయినపేటలోని చెరువు కట్టపై కొద్ది రోజుల నుంచి కంప చెట్లు ఏపుగా పెరిగిపోయి వనంలా తయారైంది. రైతులు రాకపోకలు సాగించేందుకు సైతం వీలు లేకుండా పోయింది. చెరువు కింద తిమ్మనాయినపేటలో 340 ఎకరాల ఆయకట్టు ఉంది. పసుపు, వరి, వేరుశనగ తదితర పంటలను రైతులను పండిస్తుంటారు. బి.తాడిపత్రి, బి.ఉప్పులూరు, హనుమంతుగుండం, యర్రగుడిలో మరో 300 ఎకరాలకు పైగానే ఆయకట్టు ఉంది. ఈసారి వర్షపాతం తక్కువగా ఉండడంతో చెరువులోకి పెద్దగా నీరు చేరక వెలవెలబోతోంది. చెరువు పూర్తి స్థాయిలో నిండితే రైతు లు కాల్వల ద్వారా పంటలు పండిస్తుంటారు. కట్టపై కంపచెట్లు పెరగడంతో పాటు కట్టకు బీటలు ఏర్పడి ప్రమాదకరంగా మారిందని రైతులు వాపోతున్నారు. భవిష్యత్‌లో చెరువు నిండితే కట్టకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైనర్ ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకొని కట్టపై పెరిగిన కంపచెట్లను తొలగించి మరమ్మతు పనులు చేయించాలని కోరుతున్నారు.


కట్టపై పెరిగిపోయిన కంపచెట్లు

ప్రారంభానికి ఎదురుచూపు

బేతంచెర్ల: మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేందుకు గత ప్రభుత్వం గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లను నిర్మించింది. బేతంచెర్ల మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో రూ.35 లక్షలతో గ్రామ సచివాలయం, రూ. 21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ. 17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించింది. ప్రారంభానికి సిద్ధమవుతున్న తరుణంలో ఎన్నికల ప్రక్రియ మొదలు కావడం.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అలాగే ఉండిపోయాయి. నెలలు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోకపోవడంతో ప్రాంగణాల్లో ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. మెరుగైన సేవలు అందుతాయని ఆశపడిన గ్రామస్తులకు నిరాశే మిగిలింది. అధికారులు స్పందించి సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని.. అసంపూర్తిగా ఉన్న హెల్త్ క్లినిక్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


గూటుపల్లెలో ప్రారంభానికి నోచుకోని గ్రామ సచివాలయం


రైతు భరోసా కేంద్రం

విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలకు అంకురార్పణ


విద్యుత్ దీపాలంకరణతో షిర్డీసాయిబాబా ఆలయం

డోన్: పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారిలో నిర్మించిన షిర్డీసాయి బాబా ఆలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించే విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలకు ఆదివారం అంకురార్పణ చేశారు. వేకువజామున గణపతి పూజ, అఖండ దీపారాధన, చండీ పారాయణం, యంత్ర, విగ్రహాభిషేకాలు, షిర్డీ సాయి జపాలను నిర్వహించారు. సాయంత్రం నవగ్రహ ప్రధాన దేవతామూర్తుల మంత్ర జపాదులు, వాస్తు మంటపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, సాయం దీక్షాహోమం, ప్రదోష పూజలు, మంగళహారతులను చేపట్టారు. పూజా కార్యక్రమంలో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు.


కలశ పూజలు

బీసీ హాస్టల్ తనిఖీ

కోవెలకుంట్ల: పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఎస్సీ, ఎస్టీ సెల్ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బోధనం బాలనాగన్న ఆదివారం తనిఖీ చేశారు. హాస్టల్‌లో తాగునీరు, బాత్‌రూంలు, మరుగుదొడ్లు, తదితర మౌలిక వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. హాస్టల్ భవనంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావుపూలే చిత్రపటాలు లేకపోవడంతో హాస్టల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట బీసీ సంఘం జిల్లా కార్యదర్శి వడ్డె సుబ్బరాయుడు, ప్రజా సంఘాల నాయకులు మద్దిలేటి, ఓబులేసు, బాలకమ్మన్న తదితరులు ఉన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీవీఎంసీ సభ్యుడు బాలనాగన్న

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, కలుగొట్ల, అల్లూరు, కొత్తపల్లె గ్రామాలకు సంబంధించి ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, రేవనూరు, లింగాల, గుండుపాపల గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 7:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ మధుసూదన్ యాదవ్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపురి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని ఒనైరో స్కూల్, వెంకటనాయునిపల్లె, సాక్షి నివాస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. అలాగే ఎల్ బండ ఫీడర్ కింద రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇస్తామని తెలిపారు.

మహిళకు తీవ్రగాయాలు

కోవెలకుంట్ల: పప్పుశనగ పంటను నూర్పిడి చేసే యంత్రం కింద పడి ఆదివారం ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. సంజామల మండలం వసంతాపురంకు చెందిన భూలక్ష్మి గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో శనగ పంట నూర్పిడి పనులకు వెళ్లింది. మధ్యాహ్న సమయంలో కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు యంత్రం కింద నిద్రకు ఉపక్రమించింది. గమనించని డ్రైవర్ ఆమెపై మిషన్ ఎక్కించడడంతో తీవ్రంగా గాయపడింది. తోటి కూలీలు చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై సంజామల పోలీసులు విచారణ చేస్తున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి


బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు

డోన్ టౌన్: బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. ఆదివారం డోన్‌కు వచ్చిన ఆయనకు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సదర్భంగా పాతబస్టాండ్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రోటరీ క్లబ్ భవనంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కమిటీలు, నామినేటెడ్ పోస్టులను త్వరలో భర్తీ చేస్తారని తెలిపారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి పాడుపడాలని సూచించారు. ఆ పార్టీ డోన్ నియోజకవర్గ కన్వీనర్ సంధు వెంకటరమణ, నాయకులు నటరాజ్, నాగమోహన్, మధుమోహన్ రెడ్డి, కిరణ్, రవికుమార్ పాల్గొన్నారు.

‘పాలిటెక్నిక్’ పనులకు మోక్షమెప్పుడో..?

- ● రూ.26 కోట్లతో కళాశాల నిర్మాణానికి భూమి పూజ
- ● 11 నెలలు కావస్తున్నా ప్రారంభం కాని పనులు


పాలిటెక్నిక్ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి బుగ్గన (ఫైల్)

బేతంచెర్ల: పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందిన బేతంచెర్ల మండలంలో విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవ తీసుకుని పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయించారు. కళాశాల భవనంతో పాటు హాస్టల్ నిర్మాణానికి రూ.26 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మండల పరిధిలోని గోరుమానుకొండ సమీపంలో భవన నిర్మాణానికి 4.08 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించారు. 2024 మార్చి 8వ తేదీ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి భూమి పూజ కూడా చేశారు. ప్రభుత్వం మారడంతో పనులు ప్రారంభం కాలేదు.

శేషారెడ్డి పాఠశాలలో నిర్వహణ

పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కావడంతో 2023 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 330 మంది ఉన్నారు. సొంత భవనం లేకపోవడంతో పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల భవనంలో కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాలిటెక్నిక్ కళాశాలలో విశాఖ పట్టణం తరువాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సు ఉన్న రెండో కళాశాల ఇదే కావడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తిచేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


పాలిటెక్నిక్ కళాశాలకు కేటాయించిన స్థలం

పనులు ప్రారంభించాలి



విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించాలి. 11 నెలల క్రితం భూమి పూజ నిర్వహించారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో అటు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం ఎమ్మెల్యే, అధికారులు చొరవ తీసుకొని భవన నిర్మాణ పనులు చేపట్టాలి.

–కోడె వెంకటేశ్వర్లు, సర్పంచ్, గోరుమానుకొండ

ఎమ్మెల్యే దృష్టి సారించాలి



కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడు నెలలు పూర్తి కావస్తున్నా భవనం ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం నడుస్తున్న పాఠశాలలో పాలిటెక్నిక్ కళాశాలకు అవసరమైన వసతి, మౌలిక సదుపాయాలు లేవు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని భవన నిర్మాణ పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి.

–భార్గవ్, సీపీఐ మండల కార్యదర్శి

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని, అండగా ఉంటామని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు అర్జున్‌రెడ్డి అన్నారు. మండలంలోని మర్రికుంట గ్రామంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణతో కలిసి పర్యటించారు. మాజీ ఉప సర్పంచ్ దారం వెంకటరెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తు వైఎస్సార్‌సీపీదేనని తెలిపారు. నాయకులు మురళీధర్‌రెడ్డి, ముచ్చు పరమేష్, నాగిరెడ్డి, ఎద్దులన్న, బాలస్వామి, దారం నాగేశ్వర్‌రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మర్రికుంట గ్రామస్తులతో మాట్లాడుతున్న బుగ్గన అర్జున్‌రెడ్డి, ఎంపీపీ

పీఆర్సీ, ఐఆర్‌పై ప్రభుత్వం ప్రకటన చేయాలి


మాట్లాడుతున్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు భానుసింగ్

డోన్: ప్రభుత్వ పెన్షనర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 12వ పీఆర్సీ వేసి ఐఆర్‌ను ప్రకటించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ డిమాండ్ చేశారు. స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా పెన్షనర్లకు సకాలంలో పెన్షన్‌లు వేయాలని కోరారు. ఈనెల 28వ తేదీలోపు ప్రతి పెన్షనర్ లైఫ్ సర్టిఫికెట్లను స్థానిక సబ్‌ట్రెజరీ అధికారులకు సమర్పించాలని సూచించారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు సుబ్బరాయుడు, కోశాధికారి గాలయ్య, సంఘం నాయకులు గోపాల్, లోక్‌నాథ్‌రెడ్డి, దాసప్ప, రాందాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ గర్జన కరపత్రాలు విడుదల


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కొలిమిగుండ్ల: కర్నూలులో ఈనెల 23న జరగనున్న రాయలసీమ మాలల యుద్ధ గర్జన సభ కు సంబంధించిన కరపత్రాలను ఆదివారం బెలుంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కేడం సుబ్బరాయుడు విడుదల చేశారు. కొలిమిగుండ్ల మండలం నుంచి మాలలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు చిన్న కంబయ్య,సుబ్బరాయుడు, శామ్యూల్, దావీదు, ప్రవీణ్, ప్రభుదాస్, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.


అవుకు: కరపత్రాలను విడుదల చేస్తున్న జైభీమ్ మాల మహానాడు నాయకులు

కరపత్రాల ఆవిష్కరణ

అవుకు: కర్నూలులో ఈ నెల 23న జరగనున్న రాయలసీమ మాలల యుద్ధ గర్జన సభను విజయవంతం చేయాలని జైభీమ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల దేవరత్నం కోరారు. ఆదివారం అవుకు అంబేద్కర్ కాలనీలో కరపత్రాలను విడుదల చేశారు. బుల్లి మద్దిలేటి, కటారి ఆదాం, నాగరాజు, జయచంద్ర, వినయ్, భాస్కర్, మధు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలో వసతులు కల్పించాలని వినతి

డోన్ టౌన్: వయోవృద్ధులకు రైల్వే చార్జీలో 50 శాతం రాయితీతో పాటు ప్రత్యేక భోగి కేటాయించాలని రైతు సంఘం మండల గౌరవ అధ్యక్షుడు కొయిలకొండ నాగరాజు, యూటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నరసింహులు, పెన్షనర్స్ యూనియన్ కార్యదర్శి గాలయ్య డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం పిలుపు మేరకు ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో వయోవృద్ధులకు టిక్కెట ధరలో ఇచ్చే 50 శాతం రాయితీని పునరుద్ధరించాలని, అలాగే ప్రత్యేక భోగి కేటాయించాలని కోరారు. అనంతరం స్టేషన్ మాస్టర్ వెంకటేశ్వరుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు నక్కి శ్రీకాంత్, మండల కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు పెద్దిరెడ్డి, రాముడు, హుస్సేన్, మౌలాలి, సుబ్బరాయుడు, రామదాసురెడ్డి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.


రైల్వేస్టేషన్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంఘం నేతలు

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిన్న రహిమాన్

డోన్ టౌన్: విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన షేక్ ఖాజా కుటుంబాన్ని ఆదుకోవాలని ఆవాజ్ కమిటీ జిల్లా నాయకుడు చిన్నరహిమాన్ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న ఫ్యాక్టరీలో షట్టర్ బిగిస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడం బాధాకరమని తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని.. ఇంటి పెద్దను కోల్పోయిన ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ఆవాజ్ కమిటీ సభ్యులు అక్బర్‌బాషా, మస్తాన్, షరీఫ్, రఫీ తదితరులు ఉన్నారు.

కుక్కల దాడిలో ఐదు గొర్రెలు మృతి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోటలో కుక్కల దాడిలో ఆదివారం ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన చిన్న ఓబన్న ఉన్నత పాఠశాల సమీపంలో గొర్రెల మందను ఏర్పాటు చేసుకున్నాడు. కుక్కలు మందలోకి చొరబడి దాడి చేయడంతో ఐదు గొర్రెలు మృతి చెందాయి. మళ్లీ కుక్కలు గొర్రెల వద్దకు వస్తుండడంతో వాటిని తరిమాడు. దీంతో ఆగ్రహించిన కుక్కల యజమానులు గొర్రెల యజమాని ఓబన్నపై దాడికి పాల్పడడంతో గాయపడ్డాడు. ఈ విషయంపై బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.


మృతి చెందిన గొర్రె